క్లుప్తంగా

ఘనంగా సీత్లా పండుగ

గుండాల: ఆచార సంప్రదాయాలతో మంగళవారం జగ్గతండా వాసులు సీత్లా(దాటుడు) పండుగ జరుపుకున్నారు. మహిళలంతా ప్రత్యేక పూజలతో, ఏడు రకాల వంటలను తయారు చేసి, తలలపై పెట్టుకుని డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేశారు. గ్రామ పొలిమేరల్లో ఉన్న గ్రామ, కుల దేవతలకు నైవేద్యం సమర్పించుకున్నారు. పోతురాజు దేవుడి వద్ద మేకలను, కోళ్లను బలిచ్చారు. వంటలను పశువులపై చల్లి(పొలి), గండాలను, రోగాలను తొలగించాలని వేడుకున్నారు. ప్రతీ సంవత్సరం ఈ పండుగను ఆషాడ మాసంలో మంగళవారం రోజున జరుపుకుంటామని గ్రామ పెద్దలు తెలిపారు.

అండగా నిలవండి

భద్రాచలంఅర్బన్: దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ వైస్ ప్రెసిడెంట్ పూజల లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలంలో జిల్లా అధ్యక్షుడు మద్దెల అన్నపూర్ణ సమక్షంలో జిల్లా, మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ప్రతి గ్రామానికి వెళ్లి మీటింగ్‌లు ఏర్పాటు చేసి, అక్కడ ఉన్న మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తెలుసుకుని వారికి పోలీసులు, కుటుంబ సమక్షంలో పరిష్కారం చేయాలని అధ్యక్షురాలు అన్నపూర్ణ వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్, సుజాత, డిస్ట్రిక్ సెక్రటరీ కుసుమ, జాయింట్ సెక్రటరీ మాధవి, నియోజకవర్గ ప్రెసిడెంట్ కల్యాణీ, సెక్రటరీ షమీమ్ మాలతీ, మంజుల, శిరీష, శారదా, వరలక్ష్మి, మంగ, విజయ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు డిమాండ్ చేశారు. మంగళవారం లక్ష్మీనగరం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధుల దుర్వినియోగంపై ఎంపీడీఓ కార్యాలయంలో ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు, ప్రజాపంథ నాయకుడు సాయన్నలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు, ఏవీఎస్పీ ప్రధాన కార్యదర్శి నూప నాగేశ్వరరావు, గౌరవ సలహాదారులు రేసు ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతయ్య పాల్గొన్నారు.

సింగరేణి అధికారులకు వినతి

మణుగూరురూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.బలరామ్, జీఎం (పర్సనల్) హనుమంతరావు, జీఎం(సివిల్) టి.సూర్యనారాయణ, జీఎం(ఈఅండ్ఎం) వి.సూర్యకుమార్‌లకు మంగళవారం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా, ఇఫ్టూ జిల్లా నాయకులు ఎం.నాగేశ్వరరావులు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులందరికి ప్రతీ నెల 7వ తేదీలోగా జీతాలు చెల్లించాలని, పెనాల్టీ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు ఎ.మంగీలాల్, ఆర్.ముత్తమ్మ, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ



నోట్ పుస్తకాలతో చిన్నారులు..

ములకలపల్లి: మండలపరిధిలోని తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్నారై డాక్టర్ మురళీకృష్ణ నోట్ పుస్తకాలు, స్టేషనరీని వితరణగా అందజేశారు. గత ఏడాది స్వగ్రామమైన తిమ్మంపేటకు వచ్చిన డాక్టర్ మురళీకృష్ణ విద్యార్థులకు సాయం మందిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నోట్ పుస్తకాలు, స్టేషనరీని పంపించగా.. మంగళవారం పాఠశాలలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం శంకర్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

మొక్కల పంపిణీ

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. హరితహారంలో భాగంగా గ్రామంలో సర్పంచ్ బోడా పద్మ గ్రామస్తులకు మొక్కలను అందజేశారు. ఉపసర్పంచ్ పర్సా వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఖాదర్‌మీయా, ఉపాధి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన స్వరూప భర్త పక్షవాతంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా.. దాతల సాయం కోరుతున్నారు. మానవసేవే మాధవసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.4 వేలు నగదు. ఆడపిల్లలకు 10 జతల దుస్తులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు సజ్జా శ్రీనివాస్, సాహిత్య, సభ్యులు కేశవరెడ్డి, సుప్రియ, అబ్దుల్‌పాషా, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

- పర్ణశాలలో పడకేసిన పారిశుద్ధ్యం
- భక్తుల తాకిడితో పెరుగుతున్న వ్యర్థాలు
- జీపీ కార్మికుల సమ్మెతో వెనుకబడిన పనులు



హైస్కూల్ ఎదుట పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



అతిథి గృహం వద్ద చెల్లాచెదురుగా ఉన్న వ్యర్థాలు

దుమ్ముగూడెం: దక్షిణ అయోధ్యగా ప్రసిద్దిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పర్ణశాల బస్టాండ్ సెంటర్ మొదలుకుని దేవాలయం పరిసర ప్రాంతాలు మొత్తం చెత్తతో నిండి ఉంది. పర్ణశాలకు నిత్యం వేలాది మంది భక్తులు దర్శనం కోసం వస్తుంటారు అదే శని, ఆదివారాలలో ఇంక అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఇందులో భాగంగా వారు వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిల్స్, భోజనాలు తిన్న ప్లేట్స్ ఇష్టం వచ్చినట్టు పడేయడంతో పర్ణశాల అలయం చుట్టూ చెత్త కుప్పలతో నిండి ఉండి దుర్గంధం వెదజల్లుతోంది.పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో ఉన్న సంగతి విధితమే. దీనిమూలంగా పారిశుధ్య పనులు ముందుకు కదలడం లేదు.

వ్యాధులు ప్రబలే అవకాశం..

నిత్యం వేలాది మంది భక్తులు వచ్చే ఇటువంటి పుణ్యక్షేత్రాలలో పారిశుద్ధ్యంపై అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం తరుణంలో పుణ్యక్షేత్రం వద్ద పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దేవాలయం అతిథి గృహం దగ్గర పడేసిన చెత్త చెదారంతో దుర్గంధం వాసన వెదజల్లుతోంది. బస్టాండ్ నిలిపే చోటు, స్కూల్ ముందర, కల్యాణ మండపం దగ్గర చెత్తాకుప్పలు దర్శనం ఇస్తున్నాయి. పర్ణశాల క్రాస్ రోడ్డు దగ్గర స్వాగత తోరణం వద్ద చెత్త కుండి నుంచి మురుగువాసన వెదజల్లుతుంది. ఈ చెత్తా చెదారాలను తొలగించకపోతే భారీ వర్షం పడిన సమయంలో మొత్తం రొచ్చురొచ్చుగా మారి వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. భక్తులకు, స్థానికులకు ఇబ్బందులు తల్తెకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కూలీలు దొరకడం లేదు..

ప్రస్తుతం గ్రామపంచాయతీ సిబ్బంది గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ప్రైవేట్ వ్యక్తులను చూస్తున్నాం. కానీ ఎవరూ అందుబాటులో లేరు. కూలీలు దొరికిన వెంటనే పనులు చేపట్టి చెత్తాచెదారాలను తొలగిస్తాం.

– ప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్య సిబ్బంది, విద్యా సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. అధిక జనాభా వల్ల కలిగే సమస్యలపై విద్యార్థులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 'ఒక్కరు ముద్దు, ఇద్దరు వద్దు', 'గుర్తుంచుకోండి.. సరైన వయసులోనే వివాహం చేసుకోవాలి, ఆలోచించి పిల్లల్ని కనాలి' అనే నినాదాలు చేస్తూ ర్యాలీలు తీశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: గండుగులపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాల విద్యార్థులు



ములకలపల్లి: ప్రధానకూడలిలో మానవహారంగా ఏర్పడిన వైద్య సిబ్బంది



భద్రాచలంఅర్బన్: వ్యాస రచన పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆలయ భూములు సర్వే

దమ్మపేట: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూములపై, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూములు గత కొద్ది సంవత్సరాల నుంచి అన్యాక్రాంతానికి గురికాగా.. మంగళవారం ఆ భూములపై దేవాదాయ శాఖ, వరంగల్ జోన్ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు దమ్మపేట గ్రామంలో భూసర్వే నిర్వహించారు. మంగళవారం దేవాదాయ శాఖ వరంగల్ జోన్ సర్వేయర్ పసునూరి అనిల్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.

సర్వేలో 11 ఎకరాల 8 కుంటల భూమిని ఆలయ భూమిగా చూపుతూ, వాటికి హద్దులను ఏర్పాటు చేశారు. ఈ ఆలయ భూములకు, కౌలు నిమిత్తం వేలం పాట నిర్వహించగా, ఒక సంవత్సరానికి గానూ రూ.1,94,000లకు వేలం పాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పసుమర్తి వీరేశ్వరరావు, సత్తిపండు, దేవాలయ సిబ్బంది సంపత్, మారుతీ ప్రసాద్, వెంకన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు పరిశీలన

అశ్వాపురం: మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ కార్యాలయం నుంచి గౌతమీనగర్ కాలనీ వరకు చేపడుతున్న డ్రెయినేజీ నిర్మాణానికి నాలుగు విద్యుత్ స్తంభాలు, రహదారి వెడల్పుకు 20 విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయి. దీంతో మంగళవారం ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్, ఏఈ రాంబాబు, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంభాలను పరిశీలించారు. ఈ 24 విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారులు తొలగించేందుకు నిర్ణయిస్తే.. అందుకయ్యే ఖర్చును ఆర్అండ్‌బీ శాఖ వారు చెల్లించాల్సి ఉంటుంది. మొత్తంగా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

దమ్మపేట: ములకలపల్లి మండల పరిధిలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ములకలపల్లి మండల పరిధిలోని యాదవులు, దమ్మపేట మండలంలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను కలిసి, సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీ కోసం డీడీలు చెల్లించి పది నెలలు గడిచినా ఇప్పటి వరకు పంపిణీ జరగలేదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే, కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.


వంట కార్మికుల నిరసన

మధ్యాహ్న భోజన బిల్లులు, తమ వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. మండల కేంద్రాల్లోని రిసోర్స్ కార్యాలయాలు, మరికొన్ని చోట్ల ఎంఈఓ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వారి పార్టీ నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ మద్దతును తెలిపారు.


– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న పద్మ



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాయం..

విత్తన దుకాణాల్లో తనిఖీలు

బూర్గంపాడు: మండలంలోని విత్తన, పురుగు మందుల దుకాణాలలో మంగళవారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. బూర్గంపాడు ఎస్సై సంతోష్ ఆధ్వర్యంలో దుకాణాలలోని విత్తనాలు, పురుగుమందులను పరిశీలించారు. విత్తనాల విక్రయాలకు సంబంధించిన రశీదు పుస్తకాలు తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, గడువు మీరిన పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ములకలపల్లి: మండల పరిధిలోని జగన్నాథపురంలోని ఎరువులు, పురుగుల మందుల విక్రయ దుకాణాలను మండల అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఎస్సై సాయికిషోర్ రెడ్డి, ఏఈఓ బి.రమేశ్ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించి, అమ్మకాలకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆమోదిత విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నకిలీ విత్తనాల అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ పొడియం జానకి (38) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. జానకి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతోంది. కాగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతదేహాన్ని అంగన్‌వాడీ టీచర్లు, వివిధ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు.

లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారి వెంబడి పెట్రోల్ బంక్ ప్రాంతంలో లోవోల్టేజీ విద్యుత్ సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతుండగా..ఇటీవల సర్పంచ్ మర్రి మల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ కి సమస్య విన్నవించి సమస్య పరిష్కరించాలని కోరారు. సత్వరమే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ప్రారంభించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని తన ఇంటి స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేస్తున్నాడని ఓ వ్యక్తి భద్రాచలం వచ్చిన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్ గుండేలవారి వీధిలో ఉంటున్న మునిగంటి వెంటాచారికి తన 5 సెంట్ల ఇంటి స్థలాన్ని చప్పిడిదిగువకు చెందిన కురిచేటి శ్రీనివాసరావు తన పలుకుబడితో ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. న్యాయం చేయాలని బాధితుడు కలెక్టర్‌ను కోరాడు. స్పందించిన కలెక్టర్ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానన్ని బాధితుడికి హామీ ఇచ్చారు.

డ్రెయినేజీని పటిష్టపరచాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శివారు రాజుపేట కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినందున అధికారులు స్పందించాలని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాలనీ వాసులు మంగళవారం గ్రామ పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గడ్డం సుధాకర్ మాటాడారు. సీతారాములు, ఆదిలక్ష్మి, ప్రసాద్, రవి, రమణకుమారి, కామాక్షి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మూడునాళ్ల ముచ్చటగా డ్రెయినేజీ

భద్రాచలంటౌన్: పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న గురుకుల బాలికల కళాశాల ఎదురుగా ఎమ్మెల్యే కాలనీకి వెళ్లే దారికి ఒకవైపు డ్రెయినేజీకి సైడ్ వాల్స్‌ను నిర్మించగా.. మూడు నెలలకే అవి కూటిపోయాయి. వర్షకాలం కావడంతో చిన్న వర్షం వచ్చిన వరద నీరు చుట్టు పక్కల ఇళ్లలోకి వెళ్తోంది. పరిష్కారానికి నిర్మించిన సైడ్‌వాల్స్ మూడు నెలలకే నేల కొరిగాయి అంటే కాంట్రాక్టర్ పనితీరు, అధికారులు పర్యవేక్షణ ఇట్టే అర్థమవుతుంది. సంబంధిత అధికారులు నాణ్యత లోపంతో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకు డ్రెయినేజ్ వ్యవస్థను పటిష్టం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



పడిపోయిన డ్రెయినేజీ సైడ్‌వాల్

సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

భద్రాచలంఅర్బన్: ముంపు కాలనీల్లో నిర్వహించిన సీపీఎం పాదయాత్ర కొనసాగింపులో భాగంగా మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముంపు సమస్యపై భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్‌కు సీపీఎం పాదయాత్ర బృందం వినతిపత్రం అందజేసింది. ముంపు సమస్యలు పరిష్కరించాలని, ముంపు బాధితులకు పోలవరం ప్యాకేజీ వర్తింపజేయాలని కోరగా జిల్లా కలెక్టర్ అనుదీప్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గోదావరి కరకట్టను పటిష్టం చేసి స్లూయిజ్‌లను రిపేర్ చేయించాలని, పోలవరం బ్యాక్ వాటర్ నుంచి రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు యంబీ నర్సారెడ్డి, జిల్లాకమిటీ సభ్యులు బుక్యా రమేశ్, దొడ్డా రవికుమార్, ఎం.రేణుక, సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, వై.వెంకటరామరావు, పి.సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు యు.జ్యోతి, కుంజా శ్రీనివాస్, యస్.రామకృష్ణ, యస్‌డి.ఫిరోజ్ పాల్గొన్నారు.

పాఠశాలలో చేర్పించిన ఏటీడీఓ



ఆశ్రమ పాఠశాలలో చేరిన విద్యార్థులతో అధికారులు

దుమ్ముగూడెం: ఆశ్రమ పాఠశాలలో చదవాలనే కుతుహలంతో ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి టీసీ తీసుకున్న విద్యార్థుల ఆకాంక్షను భద్రాచలం ఏటీడీవో నరసింహారావు తీర్చారు. కేసీఆర్ కాలనీకి చెందిన విద్యార్థులు చొడే లక్ష్మణ్, సోయం దేవదాస్, కోడి నాగేంద్రలు స్థానికంగా ఓ పాఠశాలలో 9 వరకు చదువుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో సౌకర్యాలను తెలుసుకుని ప్రస్తుత పాఠశాలలో టీసీలు తీసుకున్నారు. కానీ ఆశ్రమ పాఠశాలలో ఎలా చేరాలో తెలియని ఆ విద్యార్థుల విషయంలో భద్రాచలంలోని కేసీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న సోషల్ వర్కర్ ఆవుల సుబ్బారావు చొరవ తీసుకున్నారు. సుబ్బారావు ఇచ్చిన సమాచారంతో ఏటీడీవో నరసింహారావు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సొంత ఖర్చులతో మండలంలోని నారాయణపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆ విద్యార్థులను పదో తరగతిలో చేర్పించి, వారి మంచి చెడ్డలు చూడాలని హెచ్ఎంను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వాలని ధర్నా

చండ్రుగొండ: పోడుభూములే ఆధారంగా జీవనం సాగిస్తున్నామని ఆ భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మద్దుకూరు గ్రామానికి చెందిన గిరిజనులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తాము 80 మంది గిరిజనులం 2001 ఏడాది నుంచి 150 ఎకరాల్లో పోడుసేద్యం చేసుకుంటున్నామని తెలిపారు. తమకు పోడు పట్టాలు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఆందోళనలో టీడీపీ మండల అధ్యక్షుడు వారాధి సత్యనారాయణ, పోడుదారులు పద్దం బుచ్చమ్మ, మడివి పార్వతి, నాగరాజు, మంగమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోడు సేద్యమే జీవనాధారం: జెడ్పీటీసీ

ములకలపల్లి: పోడు సేద్యం చేస్తూ జీవనం సాగిస్తున్న సాగుదారులందరికీ పట్టాలివ్వాలని జెడ్పీటీసీ సున్నం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగన్నాథపురంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. సర్వే చేపట్టిన ప్రతీఎకరాకు పట్టాపాస్ పుస్తకాలు మంజూరు చేయాలని అన్నారు. మిడియం రాణి స్వగృహంలో జరిగిన ఈ సమావేశంలో పామర్తి కృష్ణారావు, ఎండి.అంజుం, పుష్పాల హనుమంతు, బూరుగుపల్లి పద్మశ్రీ, గుంటూరు ముత్తయ్య, పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ములకలపల్లి: గొర్రెల పంపిణీ చేపట్టాలని కోరుతూ యాదవ సంఘం మండలకమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. తాటిసుబ్బన్నగూడెంలో మంగళవారం ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. ఏడాది క్రితమే బ్యాంకుల్లో నగదు డీడీ తీసినా.. నేటికి రెండో విడత పంపిణీ చేపట్టలేదని, న్యాయం చేయాలని కోరారు. సంఘ మండల అధ్యక్షుడు మంచాల సారయ్య, గుంటూరు శేషగిరిరావు, మంచాల ఉపేందర్, దుర్గన్న. సురేశ్ తదితరులు ఉన్నారు.

డీసీసీబీ మేనేజర్ బదిలీ



బదిలీ అయిన మేనేజర్ ప్రసన్నప్రియను సన్మానిస్తున్న చైర్మన్

దుమ్ముగూడెం: డీసీసీబీ లక్ష్మీనగరం బ్రాంచ్ మేనేజర్ ప్రసన్నప్రియా బదిలీ అయ్యారు. దీంతో పీఏసీఎస్ చైర్మన్ కిలిమి ఎల్లారెడ్డి శాలువాతో మంగళవారం సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల కాలంలో మేనేజర్‌గా రైతులకు, ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. రైతులకు రుణాల పంపిణీ విషయంతో పాటు రికవరీ విషయంలో ఎంతో నిబద్దతో విధులు నిర్వహించారని ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ సీఈఓ ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ సందర్శన

అశ్వాపురం: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ సందర్శించారు. హాస్టల్‌లో విద్యార్థులకు సరైన వసతులు ఉన్నాయో లేదో, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదో విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్‌లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకోవాలని విద్యార్థులకు రామకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ నయీం, యువజన నాయకులు నజీర్‌షోను, జూపల్లి కిరణ్, విజయరాజు, వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం ఆరో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని పలు పార్టీల నాయకులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో పనుల నిమిత్తం ప్రైవేట్ కూలీలను వినియోగిస్తే అడ్డుకుంటామని తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు



మణుగూరురూరల్: సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఇఫ్టూ నాయకులు



బూర్గంపాడు: సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న బీఎస్పీ నాయకుడు కేవీ రమణ